పిల్లల గాంధీ

మన తల్లిదండ్రులకు నేడు తెలిసిందల్లా పాఠశాలల్లో అందుతున్న చదువులు వాళ్ళ పిల్లలకు డబ్బు సంపాదించడానికి సహకరిస్తుందని. ఆ మాత్రం చాలు వారు తృప్తి చెందడానికి. అన్నిటికన్నా పెద్ద చిక్కేమిటంటే ప్రజలకు నిజంగా విద్య అంటే ఏమిటో తెలియక పోవడం. భూముల్ని విలువ కట్టినట్టు, మార్కెట్ షేర్ లను విలువ గట్టినట్లు మనం విద్యను కూడా విలువ కట్టడానికి ప్రయత్నిస్తున్నాం. మన పిల్లలు బాగా సంపాదించడానికి ఏది పనికొస్తుందో అటువంటి చదివేవారికి ఇవ్వాలని కోరుకుంటున్నాం. చదువంటే విద్యార్థుల శీలాన్ని, సత్ప్రవర్తన పెంపొందించడం అనే భావన మనకు ఏమాత్రం కలగనే కలగడం లేదు.

కానీ గాంధీజీ పిల్లల మనసు లోతులను చవి చూశారు. వారిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించారు. మన అందరికీ తెలుసు పిల్లలందరూ గాంధీని 'గాంధీ తాత 'అని పిలుస్తారు. అలాగే బోసినవ్వుల గాంధీ మీద పాటలు కూడా అన్ని భాషలలో సుప్రసిద్ధంగా ఉన్నాయి. గాంధీ అనగానే మనకు సాధారణంగా గుర్తుకొచ్చేది బోసినవ్వులతో ఉండే గాంధీ ముఖం. ఈ కాలంలో పిల్లల్ని తల్లిదండ్రులు తమ విఫలమైన కలలు సాకారం చేసుకోవడానికి పనిముట్లుగా చూస్తున్నారు. అలాగే పిల్లల్ని చాలా సందర్భాలలో మార్కులు, పరీక్షల పేరుతో మిషన్ లు గా మార్చేశారు. పిల్లలు స్వయం సమృద్ధిగా ఉంటారని, వారికి ప్రపంచాన్ని మార్చే అద్భుత శక్తి ఉందని గాంధీజీ భావించారు.

గాంధీ ప్రధానంగా చెప్పేదేమిటంటే ప్రతి పిల్లవాడిలో అద్భుతమైన స్వచ్ఛతా శక్తి ఉంటుంది. దీని కారణంగా చిన్నప్పటినుంచి తన తల్లిదండ్రుల నుండి రూపురేఖలను ఎలా తెచ్చుకుంటాడో గుణగణాలను కూడా అలాగే తెచ్చుకుంటాడు.పసితనానికి, స్వచ్ఛతకు చాలా దగ్గరి సంబంధం ఉంది. స్వచ్ఛంగా ఉన్న మనసు సత్యానికి దూరంగా ఉండడాన్ని అంగీకరించదు గాక అంగీకరించదని గాంధీ నమ్మకం. శ్రవణ కుమారుని కథ, రాజా హరిశ్చంద్ర నాటకం బాల గాంధీ పై ఎటువంటి ప్రభావాన్ని చూపిందో మన అందరికీ తెలుసు. శ్రవణ కుమారుని కథ ద్వారా తలిదండ్రులను గౌరవించడం నేర్చుకున్నానని అలాగే సత్యం వైపు నన్ను నడిపించింది రాజా

హరిశ్చంద్ర నాటకం అని చెప్పుకుంటారు గాంధీ. చిన్నప్పటి నుండి గాంధీ తను చేసిన తప్పులను ఒప్పుకోవడానికి భయపడేవాడు కాదు. ఎవరైతే సత్యం మాట్లాడుతారో నిజాయతీగా ఉంటారో వారి జీవితం ఉత్తమంగా ఉంటుందని అంటారు.

గాంధీ దృష్టిలో ప్రతి పిల్లవాడు ఒక గురువుతో సమానం. మనం ఆ స్థాయికి దిగగలిగితే, పిల్లలను భయపెట్టకుండా వాళ్లతో మాట్లాడగలిగితే పెద్ద వాళ్ళ కన్నా అనేక విషయాలు మనం పిల్లల దగ్గర నుంచి తెలుసుకుంటాము. అందుకే గాంధీజీ జీసస్ గురించి చెబుతూ పసిపిల్లల నోటినుండి వచ్చే ప్రతి వాక్యం లో విజ్ఞానం, వివేకం కన్నా గొప్ప సత్యం దాగి ఉంటుందంటారు. గాంధీ ఒక సందర్భంలో పిల్లలకు ఒక మంచి లక్షణం ఉంటుందని చెప్పాడు. సత్యాన్ని, ప్రేమను అత్యంత సహజంగా పిల్లలు ప్రదర్శిస్తారు.   ఈ రెండు అంశాలు వాళ్లు వెంటనే గుర్తు పట్టగలరు. అందువలన ఏది ప్రేమ తో కూడినది, ఏది సత్యం అన్నది వాళ్లకు అర్థమైనట్టు మనకు ఎప్పటికీ అర్థం కాదు. ఈ విషయం పిల్లల నుండి మనం నేర్చుకోవాల్సిన అంశం. అలాగే గాంధీ పిల్లల దగ్గరకు వెళ్లేటప్పుడు వాళ్ల దగ్గర నుంచి నేర్చుకోవాలనే తపనతో వెళ్లేవారు.

పిల్లలకు ప్రపంచ చరిత్రను మార్చి వేసే శక్తి ఉంటుంది. మనం ప్రపంచానికి ప్రపంచ శాంతి కావాలంటే యుద్ధం ఉండకూడదు .శాంతి నెలకొనాలి. శాంతి నెలకొనాలి అంటే యుద్ధం మీద యుద్ధం చేయాలి. యుద్ధం మీద యుద్ధం చేయాలి అంటే ఎక్కడ ఆరంభించాలి అని ప్రశ్నించుకుంటే అది కేవలం పిల్లల నుంచి ఆరంభించాలి అంటారు గాంధీ.

పిల్లల్ని పెంచే టప్పుడు వారిలో సహజమైన అమాయకత్వాన్ని మనం పోగొట్టకుండా ఉంటే వారు అలాగే సహజంగా పెరుగుతారు. అలా పెంచబడిన పిల్లల సంఖ్య పెరిగితే మనం శాంతి కోసం ఒక సంకల్పం, ఒక తీర్మానం చేయవలసిన అవసరం ఉండదు. మరింత ప్రేమతో కూడిన మరింత శాంతితో కూడిన ప్రపంచం దానంతట అదే సృష్టించబడుతుంది. యుద్ధాలకు అటువంటి ప్రపంచంలో చోటు దొరకదు. అటువంటి ప్రపంచంలో కేవలం శాంతి మాత్రమే ఉంటుంది. అలాగే ప్రపంచం తపించే విషయాలలో ప్రేమ ఒకటి. ప్రేమగా పెంచబడిన, ప్రేమ కలిగిన వాతావరణంలో పిల్లలు పెరిగితే ప్రపంచం మొత్తము ప్రేమమయం అవుతుంది.

పిల్లలపై తలిదండ్రుల, ఇంటి ప్రభావం ఎక్కువగా ఉంటుందని, ఇంటి వాతావరణం సరిగా లేకపోతే ఎంత మంచి బడి కూడా ఏమి చేయలేదని అంటారు గాంధీజీ. పిల్లలకు పరిశుభ్రత మంచి అలవాట్లు ఇల్లు అందించాలి. మనం చెయ్యనిది ఏదీ పిల్లల్ని చేయమని అనకూడదు. పెద్ద వాళ్ల తోటి, సమాజంతోటి పిల్లలు ఏర్పరుచుకునే బాంధవ్యాన్ని మనం అర్థం చేసుకోవాలి. పిల్లలకు మన భాష, మన సంస్కృతి వారసత్వ సంపదగా అందించి వారిని నడిపించే బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిది అని గుర్తించమంటారు గాంధీ.

శిశువు తన ప్రథమ పాఠాలు తల్లినుండి నేర్చుకుంటుంది. తల్లి ప్రేమను రుచి చూస్తుంది. అందువల్ల శిశువు మానసిక అభివృద్ధి జరుగుతుంది. అలాగే తల్లి లాంటి మాతృభాషలో చదువు నేర్చుకోవడం వారి ప్రేమమయ జీవితానికి బాటలు వేసిన వాళ్ళం అవుతాము. పిల్లల భాషకు, నేర్చుకునే నైపుణ్యాలకు గల సంబంధాన్ని గాంధీజీ గుర్తుపట్టాడు. అందువల్ల పిల్లల అత్యంత సహజ అభ్యసనకు మాతృభాష ఊతం ఇస్తుందని చెప్పాడు. సొంత భాషల ద్వారా పిల్లలు మన సాహిత్యాన్ని సంస్కృతినీ ఆస్వాదించగలరని అప్పుడే ప్రపంచ విజ్ఞానం, సాహిత్య సంపదలు ప్రజల ఆస్థులవుతాయని తన ప్రగాఢ విశ్వాసాన్ని తెలియచేశారు గాంధీ.

కొంత మంది తల్లిదండ్రులు ఆంగ్ల బోధన కావాలని తాపత్రయపడి పిల్లల్ని, దేశాన్ని మోసం చేస్తున్నారని ఆయన తరచూ అనే వారు. ఆధ్యాత్మిక, సాంఘీక వారసత్వం కోల్పోయి దేశ సేవకు సరిపోని వ్యక్తులను తయారు చేస్తున్నారని ఆవేదన చెందేవారు.

పిల్లల దేహానికి,బుద్ధికి,హృదయానికి ఏకకాలంలో శిక్షణనివ్వడమే ఒక సమగ్ర విద్య అని గాంధీ నమ్మాడు. పిల్లలకు పనికి ఆటకు,నేర్చుకోవడానికి మధ్య తేడాలు ఉండవు. నా దృష్టిలో పిల్లలు ప్రతి ఆటనూ పనిలాగా, ప్రతి పనీ ఆటలాగా ఇష్టపడతారు. చదువు నేర్చుకోవడం అంటే ఇదేననీ గాంధీ అభిప్రాయం.పిల్లల ప్రపంచం ఆనందమయం కావాలి అప్పుడే ఆనందమయ ప్రపంచాన్ని భావితరం చూడగలుగుతుంది.

ప్రేమతో, శాంతి తో కూడిన ఆనంద ప్రపంచాన్ని పిల్లలకు అందించాలంటే ముందు మనం పిల్లల్ని అర్థం చేసుకోవాలి,పిల్లలను ప్రేమించాలి, పిల్లల అలోచనలను గౌరవించాలి,పిల్లల నుంచి నేర్చుకోవాలి అలాగే పిల్లలతో పాటు మనం కూడా మమేకమై మెలగాలి అన్నది పిల్లల

గురించి గాంధీజీ ఇచ్చిన సందేశం. ఈ సత్యం ఈ శతాబ్దంలోనే కాదు ఏ శతాబ్దం లోనూ ఎవ్వరూ కాదనలేరు.

నందివెలుగు ముక్తేశ్వరరావు

విశ్రాంత ఐఏఎస్ అధికారి

తిరుపతి

Phn. 9491428078

Email id. nandivelugu@yahoo.co.in